RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 471 | 16 సెప్టెంబర్ బుధవారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




# పరస్పర సున్నితత్వం పాటించాలి



## : జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ

- బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ
- పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అవసరమని మోదీ స్పష్టీకరణ
- భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధానమంత్రి
- శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి

న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

## తెలంగాణకు భారీ వర్ష సూచన..

### 19 నుంచి మూడు రోజుల వానలు



రాష్ట్రంలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సెప్టెంబరు 19 నుంచి మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ముఖ్యంగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసినట్లు ప్రకటించింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, సెప్టెంబరు 17 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా 19, 20 తేదీల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 64.5 మి.మీ. నుంచి 115.5 మి.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని అధికారులు తెలిపారు. భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్.. జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షించి, సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిధిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మూసీ నదిలోకి నీటిని విడుదల చేయాల్సి వస్తే, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఈ వర్షాలు రాష్ట్రంలో నెలకొన్న వర్షపాత లోటును కొంతమేర తగ్గించవచ్చని భావిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కంటే 19 శాతం వర్షపాత లోటు నమోదైంది. సెప్టెంబరు నెలలోనే ఇప్పటివరకు 28 శాతం లోటు ఉంది. ఇక హైదరాబాద్ నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురుస్తాయని, పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.

### ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు..

## కాంగ్రెస్ ఓటమి ఖాయం

### : కవిత



ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు. విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

### నా పీఆర్ఓ, పీఏపై 15 మంది

## గూండాలు దాడి చేశారు

### : కేటీఆర్



హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## 'అలయ్ బలయ్'కి రండి..

### చంద్రబాబును కలిసి ఆహ్వానించిన దత్తన్న



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో, అక్టోబర్ 22న నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'అలయ్ బలయ్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని చంద్రబాబును దత్తాత్రేయ ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, ఆత్మీయతను చాటుతున్న 'అలయ్ బలయ్' విశిష్టతను చంద్రబాబుకు వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. దత్తాత్రేయ ఆహ్వానం పట్ల చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వేడుకకు తప్పకుండా హాజరవుతానని తెలిపారు. దత్తాత్రేయ మాట్లాడుతూ, "అలయ్-బలయ్ వేదిక తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు మరియు సమాజంలోని వివిధ వర్గాల మధ్య సోదరభావాన్ని పెంపొందించే వేదిక" అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేవలం ఆహ్వానం మాత్రమే కాకుండా, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సంబంధాల బలోపేతంపైనా ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఉభయ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణం, ఉమ్మడి ప్రయోజనాలు, తెలుగు ప్రజల ఐక్యత, పరస్పర సహకారం వంటి కీలక అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చాయి.

# టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేశ్ కుమార్ గౌడ్ గారు పదవీ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్**




యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేడు గాంధీభవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌కు విచ్చేసిన మహేశ్ కుమార్ గౌడ్ గారికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి, డప్పు కళాకారులతో ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. మహేశ్ కుమార్ గౌడ్ గారి సారథ్యంలో టీపీసీసీ బలమైన శక్తిగా మారిందని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారుపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ గార్ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమై, రానున్న రోజుల్లో మరోసారి రాష్ట్రంలో విజయఢంకా మోగిస్తుందని జక్కిడి శివచరణ్ రెడ్డి గారు ధీమా వ్యక్తం చేశారు.

# 107 కోట్ల రూపాయలతో చేపట్టనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్**



నల్లగొండ నియోజకవర్గంలో రాములబండ గ్రామ సమీపంలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సుమారు రూ.850 కోట్లతో వివిధ రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ రహదారులను నిర్మించి, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనుల్లో ఇప్పటికే 600 మీటర్ల పురోగతి సాధించామని, అవసరమైన అదనపు నిధులను సమకూర్చుకుని జూలై 2028 నాటికి సొరంగ మార్గాన్ని పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. సొరంగ మార్గం పూర్తితో నల్లగొండ రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు తెలిపారు.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్**



మర్రిగూడ మండలం కొండూరు గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి చొరవతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామదాస్ శ్రీనివాస్ గారు లబ్ధిదారులైన ఊడుగు అంజయ్యకు రూ.23,500, జర్పుల నానుకు రూ.17,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తోందని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలిచేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారికి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమ్ముల వెంకటేష్ గౌడ్, బాయికాడి కొండల్, ఉడుగు శ్రీను, ఉడుగు అంజయ్య, జాల వెంకటయ్య, తన్నీరు యాదయ్య, సీత యాదయ్య, దండుగల కొండల్, కొలకులపల్లి జంగయ్య, చెరుకు యాదయ్య, బండి యాదయ్య, కర్నాటి నర్సింహ, బైకడి రాజు, అంకెం నవీన్, జర్పుల శంకర్, ఆవుల రమేష్, జర్పుల శ్రీను తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం మంత్రి వివేక్ వెంకటస్వామి






**హైదరాబాద్ ఎస్టేట్ 15సెప్టెంబర్**

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంతంలోని 5వ వార్డులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి విద్యార్థులకు షేర్ ద విజన్ – ఖమ్మం సంస్థ ప్రతినిధి పి.నారాయణ ఆధ్వర్యంలో అందజేసిన వాటర్ బాటిల్, నోట్ పుస్తకాలు, క్రీడా సామాగ్రి లతో కూడిన కిట్లను జిల్లా కలెక్టర్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, షేర్ ద విజన్ సంస్థ సభ్యుల తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కిట్లు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో రూఫింగ్ పనుల కొరకు 30 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులు మంజూరు చేయడం జరిగిందని, విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రమైన త్రాగునీటి కొరకు ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, కాస్మెటిక్ ఛార్జీలు, క్రీడా సామగ్రి తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మెస్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, ఉపాధ్యాయుల నియామకం చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ మండలం సోమనపల్లిలో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు అందుబాటులోకి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చెన్నూర్ లో డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ఈ సంవత్సరం విద్యార్థుల నమోదు పెరిగిందని తెలిపారు. సోమనపల్లిలో సుమారు 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 100 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఆర్.ఓ. ప్లాంట్ల ఏర్పాటు, నాణ్యమైన ఆహారం, యూనిఫాంలు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, సొంత భవనాలు లేని పాఠశాలలకు సొంత భవనాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో లెర్నింగ్ అవుట్‌కమ్స్ మెరుగ్గా ఉన్నాయని, ఇదే స్థాయిని కొనసాగించేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# గణేశ నామస్మరణతో మార్మోగిన గీసుగొండ

### - శ్రీ లక్ష్మీ గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



**గీసుగొండ, సెప్టెంబర్ 15, హైదరాబాద్ ఎస్టేట్:**
మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో శ్రీ లక్ష్మీ గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం రెండో రోజు సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భజనలు, హోమాలు, కుంకుమ పూజ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పురోహితులు బెజ్జంకి భిక్షపతి దైవజ్ఞ ఆచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు విగ్రహ దాతగా మారుపాక సుధాకర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. రెండో రోజు పూజల్లో భక్తులు భక్తిప్రపత్తులతో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలు పూర్తైన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. గణేశ నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో మిగిలిన రోజుల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి కృపకు పాత్రులు కావాలని శ్రీ లక్ష్మీ గణపతి యూత్ అసోసియేషన్ సభ్యులు కోరారు.

# నర్సంపేట మినీ స్టేడియానికి గోక లీలావతి ట్రస్ట్ చేయూత

### - రూ.12 వేల విలువైన గడ్డి కోత పరికరం అందజేత




**నర్సంపేట,సెప్టెంబర్ 15 హైదరాబాద్ ఎస్టేట్:**
క్రీడాకారులు, వాకర్స్‌కు మెరుగైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో నర్సంపేట మినీ స్టేడియానికి గోక లీలావతి ట్రస్ట్ రూ.12 వేల విలువైన గడ్డి కోత పరికరాన్ని అందించింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు గోక రామస్వామి తన సతీమణి గోక లీలావతి జ్ఞాపకార్థం, వారి కుమారులు గోక వినోద్, గోక నాగరాజు సహకారంతో ఈ పరికరాన్ని సమకూర్చారు. వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్, ఎస్సార్ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ అభ్యర్థన మేరకు ఈ సహకారం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మినీ స్టేడియంలో పెరిగిన గడ్డి కారణంగా క్రీడాకారులు, వాకర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గోక రామస్వామి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి పరికరాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఈ పరికరంతో స్టేడియం పరిసరాలను క్రమం తప్పకుండా శుభ్రంగా ఉంచి, క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. క్రీడాభివృద్ధికి తోడ్పాటునందించిన గోక లీలావతి ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్టేడియం ఇన్‌చార్జి, కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ముదిరాజ్, సీనియర్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు గూడెపు బిక్షపతి, వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఈసాల లక్ష్మయ్య, వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడెపు సదానందం, సభ్యుడు డేవిడ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు దేవేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ

### - రేపు ఆశావహుల నుంచి దరఖాస్తులు..

### - ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు



**వరంగల్, సెప్టెంబర్ 15, హైదరాబాద్ ఎస్టేట్:**
వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్ష పదవికి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అధ్యక్షుడి నియామక ప్రక్రియలో భాగంగా బుధవారం (సెప్టెంబర్ 16) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టనున్నారు. టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ చంద్రకళ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి హాజరై ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడి శివ తెలిపారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్ష పదవికి ఆసక్తి ఉన్న ఆశావహులు నిర్ణీత సమయంలో వెంకట్రామ జంక్షన్ సమీపంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి హాజరై తమ దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

హైదరాబాద్ ఎస్టేట్
16 సెప్టెంబర్ బుధవారం 2026

# భూమికి బలం..

## ప్రకృతి వ్యవసాయమే మార్గం

**- కొనాయమాకుల రైతువేదికలో రైతులకు శిక్షణ..**

**- భూసార పరిరక్షణకు నాలుగు కీలక సూత్రాలపై అవగాహన**



**గీసుగొండ, సెప్టెంబర్ 15, హైదరాబాద్ ఎస్టేట్:**
భూమి సారాన్ని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన పంటల సాగుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. గీసుగొండ మండలంలోని కొనాయమాకుల రైతువేదికలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్202627) కింద రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతారం గ్రామ సర్పంచ్ తాటికాయల సతీష్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. టెలికాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి రైతులను ఉద్దేశించి ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లు, భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేశారు. గీసుగొండ మండలంలో ఈ ఏడాది ఎన్ఎంఎన్ఎఫ్ పథకాన్ని అనంతారం గ్రామంలో అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 'భూసారాన్ని రక్షించుకుందాంభవిష్యత్తును కాపాడుకుందాం' అనే అంశంపై జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులకు ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయానికి పునాదిగా నిలిచే మట్టి కప్పుదల, జీవామృతంఘనజీవామృతం వినియోగం, బీజామృతంతో విత్తన శుద్ధి, వాఫసా విధానంపై వివరించారు. మట్టిలో తేమను నిలుపుకోవడం, సూక్ష్మజీవుల చైతన్యాన్ని పెంచడం, విత్తనాల ఆరోగ్యకరమైన మొలకకు తోడ్పడటం, నేలలో గాలినీటి సమతుల్యతను కాపాడటం ద్వారా భూసారాన్ని మెరుగుపరచవచ్చని వివరించారు. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా నేల స్వభావాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి మానస, విశ్వనాథపురం క్లస్టర్ ఏఈఓ పాలకుర్తి అఖిల, గీసుగొండ క్లస్టర్ ఏఈఓ బల్లు భరత్, హెచ్ఈఓ వేణుకుమార్, కృషిసఖీలు గాదం సుమలత, సయింపు హైమావతి, ప్రకృతి వ్యవసాయం కోసం ఎంపికైన క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

# డాక్టర్ రమేష్ జన్మదిన వేడుకలు

**- ఆరేపల్లి హవేలీలో అభిమానుల ఆత్మీయత నడుమ కేక్ కట్..**

**- శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు, గ్రామస్తులు**



**గీసుగొండ, సెప్టెంబర్ 15 హైదరాబాద్ ఎస్టేట్:**
నిమ్స్ అనుసంధాన అధికారి డాక్టర్ మార్త రమేష్ జన్మదిన వేడుకలు ఆరేపల్లి హవేలి గ్రామంలో అభిమానులు, మిత్రులు, గ్రామస్తుల మధ్య ఆత్మీయంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి, అనంతరం బిస్కెట్లు పంపిణీ చేశారు. డాక్టర్ రమేష్ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఏకాంబ కమలాకర్, రఘుపతి రెడ్డి, నాగరాణి, తిరుపతి, విజయ్, నరేష్, కమలాకర్, బాలరాజు, రాజేశ్వరరావు, జగన్మోహన్‌రెడ్డి, యువరాజు, రామారావు, శంకర్రావుతో పాటు మిత్రులు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పై కేటీఆర్ ధ్వజం

**- ప్రతిపక్షాలపై దాడులు.. శాంతిభద్రతల వైఫల్యం : కేటీఆర్**




హైదరాబాద్, సెప్టెంబర్ 15 హైదరాబాద్ ఎస్టేట్:
కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రతిపక్షాలపై, సామాన్య ప్రజలపై దాడులు కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ఆరోపించారు. తెలంగాణను సాధించి అభివృద్ధి చేసిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నివాసంపై దాడికి దిగడం, దానిని అడ్డుకునేందుకు వెళ్లిన ఎమ్మెల్యేలను పోలీసులు నిర్బంధించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఢిల్లీ చేరుకున్న కేటీఆర్ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏఎన్ఐ ప్రతినిధితో మాట్లాడారు. ఈ సందర్భంగా సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తన పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేష్‌పై దాడి జరిగిందని ఆరోపించారు. పండుగ రోజున వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి దాడికి పాల్పడటం, ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఘటనపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు ఉన్నారు.

# ఇంజనీర్ల సేవలు దేశ అభివృద్ధికి కీలకం

**: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళులు..**

**జడ్పీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తా**

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
తేదీ :15/09/2026-మంగళవారం,
జెడ్పీ కార్యాలయం,హనుమకొండ జిల్లా.
ఇంజనీర్ల సేవలు దేశ అభివృద్ధిలో అత్యంత కీలకమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన మౌలిక వసతుల కల్పనలో ఇంజనీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు.ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా ప్రజాప్రతినిధుల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు పాల్గొన్నారు. స్థానిక ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భారతదేశ ప్రఖ్యాత ఇంజనీర్, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు దేశ నిర్మాణంలో అందించిన సేవలు, ఇంజనీరింగ్ రంగానికి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులు అందించడంలో ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.హనుమకొండ జిల్లా ప్రజాప్రతినిధుల కార్యాలయ పరిధిలోని జడ్పీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారిని కోరారు.జడ్పీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లి, నిధులు కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శిథిలావస్థకు చేరుకున్న భవనం స్థానంలో ఆధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనం ఏర్పాటు చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.వచ్చే నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు హనుమకొండ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, చారిత్రక ఆర్ట్స్ కాలేజ్‌తో పాటు కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి కూడా అవసరమైన నిధులు కేటాయించేలా ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు తెలిపారు.వరంగల్ నగరానికి విద్యా, సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యతను మరింత పెంచే విధంగా ఆర్ట్స్ కాలేజ్, కాకతీయ యూనివర్సిటీలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని అన్నారు. విద్యా సంస్థలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఇ.వి శ్రీనివాస్ రావు మరియు స్థానిక ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 17 'తెలంగాణ విమోచన దినోత్సవాన్ని' ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.

**బిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కాంటెస్టెడ్ కాండిడేట్ శ్రీమతి రావు పద్మ రెడ్డి డిమాండ్**

**బిజెపి జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గారికి మెమొరాండం అందజేసిన బిజెపి నాయకులు.**

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**
సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరిపించినప్పుడే వీర అమరవీరులకు నిజమైన శ్రద్ధాంజలి అర్పించినట్లు అవుతుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బిజెపి నాయకురాలు శ్రీమతి రావు పద్మ రెడ్డి అన్నారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు, హనుమకొండ జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీ కొలను సంతోష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ గారికి మెమొరాండం సమర్పించారు. ఈ కార్యక్రమానికి శ్రీమతి రావు పద్మ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా పగడాల కాళీప్రసాద్, పులి సర్రోతం రెడ్డి, రాష్ట్ర నాయకులు గుజ్జ సత్యనారాయణ రావు, రావుల కిషన్, మాజీ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందగట్ల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంద్ర మధు, జిల్లా పదాధికారులు ఆకుల శ్రీకాంత్, తోపుచెర్ల అర్చన మధుసూదన్ రావు, నర్మెట్ట శ్రీనివాస్ రావు గౌడ్, సంపత్ రెడ్డి, బైరి శ్రావణ్, తీగల భరత్ గౌడ్, సుంకరి శ్రీరామ్ రెడ్డి, అరణ్య రెడ్డి, ధనలక్ష్మి, జరీనా, మునిగల పద్మ, రవీందర్ రెడ్డి, శివకుమార్, కొత్త రవి కుమార్, రాంబాబు, వీసాం రమణ రెడ్డి, కాయిత రాజ్ కుమార్, జైపాల్ రెడ్డి, వివిధ డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కాంటెస్టెడ్ కాండిడేట్ శ్రీమతి రావు పద్మ రెడ్డి గారి కామెంట్స్:

- తెలంగాణ వీర చరిత్రను, అమరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన గురుతర బాధ్యతతో 1998 నుండి బిజెపి నిరంతరం పోరాటం చేస్తోంది.

- దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే, తెలంగాణకు 13 నెలల ఆలస్యంగా 1948 సెప్టెంబరు 17న స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య ద్వారా నిజాం పాలన ముగిసి, తెలంగాణలో మువ్వన్నెల జెండా ఎగిరింది.

- రజాకార్ల వారసత్వంగా ఉన్న మతోన్మాద ఎంఐఎం పార్టీకి కొమ్ముకాస్తూ, గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా మారుపేర్లతో ప్రజలను మోసం చేస్తున్నాయి. ఈ చర్యలను ప్రజలు తిప్పికొట్టాలి.

- కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి గారి కృషితో భారత ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఈ సంవత్సరం కూడా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా, ఘనంగా నిర్వహిస్తోంది.



- వేలాది మంది అమరుల పోరాటాలను, త్యాగాలను తెలంగాణ పాఠ్యపుస్తకాల సిలబస్‌లో చేర్చాలి.

- అనాడు బిజెపి ఆధ్వర్యంలో పరకాలలో 'అమరధామం' నిర్మించినట్లే, రాష్ట్రవ్యాప్తంగా పోరాట ప్రాంతాలను గుర్తించి స్మృతికేంద్రాలుగా అభివృద్ధి చేయాలి.

తెలంగాణ ఉద్యమ సమయంలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేసిన నాయకులు, నేడు అధికారంలోకి వచ్చాక ఎందుకు విస్మరిస్తున్నారో సమాధానం చెప్పాలని, వెంటనే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# మాల, మాదిగ ఉపకులాల ఐక్య వేదిక ధర్నాలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు...

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

మాల, మాదిగ ఉపకులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు మాట్లాడుతూ.. దళితులను అవమానించే విధంగా వ్యవహరించిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పేర్కొన్నారు.
దళితుల హక్కులు, ఆత్మగౌరవం కోసం మాల, మాదిగ ఉపకులాలన్నీ ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను తీవ్రంగా ఖండించారు.దళితులు వెళ్లిన ప్రదేశాన్ని బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేసిన నీచపు సంస్కృతిపై మండిపడ్డారు. గత పది ఏళ్లలో దళితులను అనేక సందర్భాల్లో అవమానించిన బిఆర్ఎస్ పార్టీకి దళితుల సత్తా చూపించాలని అన్నారు.దళితుల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. దళితుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా




పోరాడుతామని స్పష్టం చేశారు.దళితులను అవమానించే ఏ చర్యనూ సహించబోమని, ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీ తీరును ఎండగడతామని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు,దళిత సంఘాల నాయకులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

16 సెప్టెంబర్ బుధవారం 2026

# ప్రభుత్వ పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

## - కమలాపూర్ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఎస్ఎఫ్ఐ..

## - నాణ్యమైన భోజనం, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని డిమాండ్







**కమలాపూర్, సెప్టెంబర్ 15 హైదరాబాద్ ఎస్టేట్:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి, నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కమలాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో వారి సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. కమలాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులతో సమస్యలను నేరుగా తెలుసుకున్న అనంతరం వారితో కలిసి భోజనం చేసి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని కళ్యాణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అజయ్, వినయ్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# బస్సుపై కూలిన భారీ చెట్టు.. ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం

## - నాలుగు వాహనాలు ధ్వంసం.. తెగిపడిన విద్యుత్ తీగలు







**హనుమకొండ, సెప్టెంబర్ 15, హైదరాబాద్ ఎస్టేట్:**

హనుమకొండ పబ్లిక్ గార్డెన్ మూలమలుపు వద్ద మంగళవారం భారీ వృక్షం ఒక్కసారిగా నేలకూలింది. చెట్టు కూలడంతో విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఈ ఘటనలో సమీపంలోని రెండు ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. అదే సమయంలో సిరిసిల్ల నుంచి హనుమకొండ బస్టాండ్‌కు వెళ్తున్న టీఎస్ 23 టీ 8923 ఎక్స్‌ప్రెస్ బస్సు పబ్లిక్ గార్డెన్ మూలమలుపు వద్దకు చేరుకుంది. అప్పటికే కూలిన భారీ చెట్టు, విద్యుత్ తీగలు బస్సుపై పడటంతో ప్రయాణికుల్లో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది. అయితే అదృష్టవశాత్తూ బస్సులోని ప్రయాణికులెవరూ గాయపడలేదు. ప్రాణనష్టం కూడా జరగలేదు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకటరత్నం సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. చెట్టు కొమ్మలు, విద్యుత్ తీగలను తొలగించే పనులను సంబంధిత సిబ్బంది చేపట్టారు. భారీ వృక్షం కూలి నాలుగు వాహనాలు ధ్వంసమైనప్పటికీ.. అదే సమయంలో బస్సుపై చెట్టు పడిన ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడటం ఈ ఘటనలో ఊరటనిచ్చిన అంశంగా నిలిచింది.

# ఇందిరా మహిళా డెయిరీ పనులు వేగవంతం చేయాలి

## - దామెరలో నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి..

## - నాణ్యతతో నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశం

**దామెర, సెప్టెంబర్ 15 హైదరాబాద్ ఎస్టేట్:**



దామెర మండల కేంద్రంలో నిర్మిస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ నిర్మాణ పనులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. డెయిరీ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళిక, స్థల పరిస్థితులు, రహదారి సౌకర్యాలను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఆర్థికంగా స్వావలంబన కల్పించడంతో పాటు రైతులకు పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరకాల ఇందిరా మహిళా డెయిరీని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డెయిరీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్మాణ పనులు నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

# రికార్డులు పక్కాగా.. పారిశుద్ధ్యం మెరుగ్గా

## - దస్రుతండ, సూర్యతండలో డీపీఓ కటకం కల్పన ఆకస్మిక తనిఖీ

**గీసుకొండ, సెప్టెంబర్ 15 హైదరాబాద్ ఎస్టేట్:**

గ్రామ పంచాయతీల పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనంతోపాటు రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన సూచించారు. మంగళవారం దస్రుతండ, సూర్యతండ గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్లు, రోజువారీ నమోదులు, సంబంధిత యాప్‌లలో సమాచార నమోదును పరిశీలించారు. రికార్డుల్లోని వివరాలు క్షేత్రస్థాయి అభివృద్ధి పనులతో సరిపోలేలా చూడాలని, డిజిటల్ నమోదులో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. వినాయక చవితి నేపథ్యంలో మండపాల పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించి, పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రామాల్లో కొనసాగుతున్న రహదారులు, డ్రైనేజీ, మౌలిక వసతుల పనులను నాణ్యతతో చేపట్టి ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేయాలని అన్నారు. విధుల్లో అలసత్వం, రికార్డుల నిర్వహణ లేదా పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీఓ హెచ్చరించారు. తనిఖీల్లో ఎంపీఓ తిరుణహరి శేషాంజన్ స్వామి, పంచాయతీ కార్యదర్శులు వినోద్, వీరేష్ పాల్గొన్నారు.



# ఆర్ఆర్ కందుకూర్ కొత్తూరు లిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 15**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం లోని కందుకూర్ మండల్ కొత్తూరు గ్రామంలో లిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు... దయ్యాల శ్రీశైలం 9వ వర్ధంతి సందర్భంగా కొత్తూరు గ్రామంలో ఉన్న ప్రజలు ఉచితంగా వైద్య సదుపాయాన్ని వినియోగించుకున్నారు... ఈ సందర్భంగా లింక్స్ ఆసుపత్రి డాక్టర్లు సుమారు 200 మందికి ఉచిత హెల్త్ క్యాంపు తో పాటు ఉచితంగా అన్ని రకాల వైద్య సదుపాయాలు ఈసీజీ గుండెకు సంబంధించిన వైద్యం టాబ్లెట్స్ కొత్తూరు గ్రామ ప్రజలకు ఉచితంగా మందులు అందించారు... ఈ మెగా హెల్త్ క్యాంపులో సుమారు ఆరుగురు రక్తదానం చేశారు... మహేష్ జర్నలిస్ట్ కూడా రక్తదాన శిబిరంలో పాల్గొని తన రక్తాన్ని అందించాడు... ఈ హెల్ప్ మెగా హెల్త్ క్యాంపుకు సుమారు 200 మంది హాజరయ్యారు... రకరకాల రోగులకు క్షుణ్ణంగా పరిశీలించి బిపి షుగర్ తో పాటు దీర్ఘకాలిక రుగ్మతులను తొలగించేందుకు ప్రత్యేక చికిత్స నిర్వహిస్తామని ప్రతి ఒక్కరూ లిమ్స్ ఆసుపత్రి వైద్య సదుపాయాలను అంది పుచ్చుకోవాలని తెలియజేశారు... ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంప్ లో కొత్తూరు గ్రామ ప్రజలు హెల్త్ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఉచితంగా చెకప్ చేసుకొని మందులు టానిక్లు తీసుకున్నారు... ఈ కార్యక్రమంలో సుమారుగా 6 మంది డాక్టర్లు పదిమంది వైద్య సిబ్బంది గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు...

స్రవంతి గైనకాలజిస్ట్ డాక్టర్ లెన్స్ ఆస్పత్రి

డాక్టర్ కిషన్ రెడ్డి లిమ్స్ ఆస్పత్రి

కృష్ణ కొత్తూరు గ్రామ సర్పంచ్

4). శ్రీశైలం బంధువులు ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించిన కుటుంబ సభ్యులు

: డాక్టర్ శంకర్ రెడ్డి డాక్టర్ స్రవంతి డాక్టర్ నిషితా రెడ్డి డాక్టర్ హనుమంతుడు

దయ్యాల లక్ష్మణ దయ్యాల శ్రీకాంత్ దయ్యాల జ్యోతి దయ్యాల అధయ శ్రీ
దయ్యాల షెరియన్స్
దయ్యాల పరమేష్

# గంగారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో యూనిఫామ్, టై, షూ, అందజేసిన గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 15:)**




రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామంలో...ప్రభుత్వ స్కూల్లో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఆధ్వర్యంలో స్కూలు యూనిఫామ్ టై షూ ఇవ్వడం జరిగింది గవర్నమెంట్ ఇచ్చే పథకాలు ఇచ్చినవి ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఉండాలని తెలంగాణ గ్రామ ప్రజల కోరిక మేరకు స్కూల్ పిల్లలు ఉన్నంత స్థాయిలో ఎదగాలని ఉద్యోగాలు వచ్చేవరకు ఇంటర్నేషనల్ స్కూల్లో ఉద్యోగాల సర్టిఫికెట్ ఇవ్వడమే సీఎం నెరవేయాలని ప్రతీ గ్రామంలో పిల్లలు ఉన్నంత స్థాయికి చదవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఉప సర్పంచ్ మహేందర్ వార్డ్ మెంబర్ రవి పద్మాదేవ మోహన్ స్కూల్ టీచర్ సురేష్ డ్వాక్రా గ్రూప్ సంఘం మంజుల తదితులు పాల్గొన్నారు

# తెలంగాణ రక్షణ సేన సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తేజా చౌదరి

## నియామక పత్రం అందజేసిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత




హైదరాబాద్, సెప్టెంబర్ 15: తెలంగాణ రక్షణ సేన సోషల్ మీడియా అండ్ డిజిటల్ మీడియా విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా హిమాయత్‌నగర్‌కు చెందిన తేజా చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తేజా చౌదరి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలు, భావజాలాన్ని సోషల్ మీడియా, డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు పూర్తి అంకితభావం, నిజాయితీతో పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తూ, డిజిటల్ వేదికలపై తెలంగాణ రక్షణ సేన స్వరాన్ని బలంగా వినిపిస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కె. కవితకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
16 సెప్టెంబర్ బుధవారం 2026

# గుమ్మడవెల్లి తండాలో తాగునీటి కోసం స్థానికుల కేఎల్ఆర్ కి వినతి



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 15:)**

పార్టీ పదవులు, సొసైటీ బ్యాంకు ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, డైరెక్టర్ల పదవుల్లో సామాజిక న్యాయం పాటించాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలకు ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు.తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... ప్రజా పాలన, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన విధానంతోపాటు... పార్టీ సీనియర్లు, ఎస్సీ, ఎస్టీ,,బీసీ , మైనార్టీ వర్గాలకు దామాషా ప్రకారం పదవులు కల్పించాలని కోరారు.

కాలనీల సమస్యలపై త్వరలో సమావేశం: లక్ష్మారెడ్డి

బడంగ్ పేట, నాదర్ గుల్, బాలాపూర్, మీర్ పేట, జిల్లెలగూడ, ప్రశాంతిహిల్స్ డివిజన్లలో నెలకున్న కాలనీల సమస్యలపై త్వరలోనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తీర్చేందుకు ఆయా శాఖల అధికారులతో కాలనీల ప్రెసిడెంట్స్, ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నేతలతో త్వరలో ప్రత్యేక సమావేశం ఉంటుందని కిచ్చెన్న చెప్పారు.గుమ్మడవెల్లి తండాలో మంచినీటి సమస్యకు పరిష్కారం: కెఎల్ ఆర్

కందుకూరు మండలం గుమ్మడవెల్లి తండాలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులతో కెఎల్ఆర్ ఫోన్లో మాట్లాడారు. రోడ్లు వెడల్పు, మరమ్మతులకు విద్యుత్ స్థంబాలు అడ్డంకిగా మారయని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కిచ్చెన్న దృష్టికి తెచ్చారు. అధికారులు సమన్వయం చేసుకుని వెంటనే గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రోడ్ల సమస్యల పరిష్కారం కోసం వినతి



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 15:)**

మహేశ్వరం మండలంలోని అధ్వాన్నంగా ఉన్న రోడ్లు, గుంతలు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర రవాణా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఈఈ ని కలిసి మెమోరాండం అందజేయడం జరిగింది. అదేవిధంగా హెచ్ఎంఎం ప్రాజెక్ట్ కింద మంజూరైనప్పటికీ ఇప్పటివరకు ప్రారంభం కాని 12 రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కోరడం జరిగింది.మంజూరైన పనులు కాగితాలకే పరిమితం కాకూడదు. ప్రజలకు ఉపయోగపడేలా పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కావాలి. గుంతల రోడ్ల కారణంగా ప్రజల ప్రాణాలు, వాహనదారుల భద్రత ప్రమాదంలో పడకూడదు. ఆయా రోడ్లకు సంబంధించిన సమస్యలు, పెండింగ్లో ఉన్న పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరడం జరిగింది.ఈ వినతిపై ఈ ఈ సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాసాని వెంకటేష్ గౌడ్ , రంగారెడ్డి జిల్లా దిశా కమిటీ మెంబర్ ఆంబోజి శ్రీనివాస్, మండల అధ్యక్షులు యాదిష్ , మండల జనరల్ సెక్రటరీ వనంపల్లి శ్రవణ్ ,టి. యాదిష్‌బీజేపీ మహేశ్వరం మండల అధ్యక్షులు. తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# శ్రీ సాయి వైన్స్‌లో నకిలీ మద్యం అమ్మకాలు..?

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్**




ఆరోపణలు చేస్తున్న మద్యం ప్రియులు.మర్రిగూడ మండల కేంద్రంలోని శ్రీ సాయి వైన్స్‌లో నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయంటూ పలువురు మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. తాము కొనుగోలు చేసిన కొన్ని మద్యం బాటిళ్లలో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. మద్యం సేవించిన అనంతరం గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు వినియోగదారులు ఆరోపించారు. ప్రభుత్వ అనుమతులతో నిర్వహిస్తున్న మద్యం దుకాణంలో నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మండలంలోని ఒక గ్రామానికి చెందినవారు బ్లెండర్స్ ప్రైడ్ కోటర్ కొనుగోలు చేయగా అట్టి మద్యం చీప్ లిక్కర్ కంటే మరీ ఘోరంగా ఉన్నదని సదరు వ్యక్తులు తెలియపరిచారు. అంతేకాకుండా అంతేగాక వారు కొనుగోలు చేసిన మద్యం బాటిల్ను అక్కడనే విసిరేసి, స్థానిక వైన్స్ వద్ద కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ఈ వైన్స్ పై మండల వ్యాప్తంగా మద్యం ప్రియులకు నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయనే అనుమానం ఉన్నది. ఇట్టి విషయంపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు శ్రీ సాయి వైన్స్‌పై సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, విక్రయిస్తున్న మద్యం బాటిళ్ల నాణ్యత, బ్యాచ్ నంబర్లు, సీల్ తదితర అంశాలను పరిశీలించాలని మద్యం ప్రియులు కోరుతున్నారు. ఈ విషయంపై వైన్స్ యజమాన్ని చరవాణిలో సంప్రదించగా అతను ఫోన్ లిఫ్ట్ చేయలేదు. నకిలీ మద్యం విక్రయాలు నిజమేనా? లేక వినియోగదారుల అనుమానాలేనా? అన్నది అధికారుల తనిఖీలతోనే తేలాల్సి ఉంది. ఈ ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# అమరవీరుల త్యాగాలు తెలంగాణ చరిత్రకు చిరస్మరణీయం

## - విమోచన దినోత్సవం సందర్భంగా పర్వతగిరి నుంచి కొంకపాకకు భారీ బైక్ ర్యాలీ..

## - అమరవీరుల స్తూపం వద్ద కొండేటి శ్రీధర్ నివాళులు



**వర్ధన్నపేట, సెప్టెంబర్ 15, హైదరాబాద్ ఎస్టేట్:**

తెలంగాణ విమోచన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని వర్ధన్నపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పర్వతగిరి మండల కేంద్రం నుంచి కొంకపాక గ్రామం వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్వతగిరి మండల అధ్యక్షుడు హార్కవత్ వినోద్ ఆధ్వర్యంలో ర్యాలీ కొనసాగింది. కొంకపాక చేరుకున్న అనంతరం గ్రామంలోని అమరవీరుల స్తూపం వద్ద శ్రీధర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలోనే కొనసాగిందన్నారు. నిజాం సైన్యానికి చెందిన రజాకార్లు తెలంగాణ ప్రజలపై అణచివేత, హింసకు పాల్పడ్డారని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. అప్పటి ఉప ప్రధాని, కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చొరవతో కేంద్ర ప్రభుత్వం 1948 సెప్టెంబర్ 13న 'ఆపరేషన్ పోలో'ను ప్రారంభించిందని శ్రీధర్ తెలిపారు. ఐదు రోజుల అనంతరం సెప్టెంబర్ 17న నిజాం లొంగుబాటు ప్రకటించడంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని వివరించారు. ఈ పరిణామంతో నిజాం, రజాకార్ల పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ ప్రతి ఏటా సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని శ్రీధర్ పేర్కొన్నారు. విమోచన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, బీజేవైఎం నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవమే

## - అధికారికంగా నిర్వహించాలి..

## - 'తెలంగాణ సప్త సంకల్పాలు' అమలు చేయాలి: బీజేపీ






**వరంగల్, సెప్టెంబర్ 15 హైదరాబాద్ ఎస్టేట్:**

సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా నిర్వహించాలని, విమోచన చరిత్రను భావితరాలకు శాశ్వతంగా అందించేలా 'తెలంగాణ సప్త సంకల్పాలు' అమలు చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, సిద్ధం నరేష్ పాల్గొన్నారు. తర్వాత వరంగల్ చౌరస్తాలోని కె.కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన, మరుగునపరచలేని ఘట్టమని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు ముగింపు పలికి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన ఈ చారిత్రక పరిణామాన్ని తెలంగాణ విమోచన దినోత్సవంగా గౌరవించాలని కోరారు. పేరును మార్చడం ద్వారా చరిత్ర మారదని, చారిత్రక ఘట్టాల ప్రాధాన్యతను రాజకీయ ప్రయోజనాల కోసం తగ్గించడం సరికాదని అన్నారు. హైదరాబాద్ విమోచన ఉద్యమాన్ని తెలంగాణ సాయుధ పోరాటంతో పూర్తిగా సమానం చేయడం చారిత్రక వాస్తవాలను కలగాపులగం చేయడమేనని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. రెండు ఉద్యమాలకు భిన్నమైన రాజకీయ నేపథ్యం, లక్ష్యాలు, కాలపరిమితి ఉన్నాయని వివరించారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో రైతులు, పేదలు, సామాన్య ప్రజలు చేసిన త్యాగాలను గౌరవిస్తూనే, 1948 సెప్టెంబర్ 17నాటి హైదరాబాద్ రాష్ట్ర విలీన ఘట్టాన్ని కూడా ప్రత్యేక చారిత్రక పరిణామంగా గుర్తించాలని అన్నారు. సాయుధ పోరాటం 1946 నుంచి 1951 వరకు కొనసాగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సెప్టెంబర్ 17 తర్వాత కూడా అది కొనసాగిందని తెలిపారు. నిజాం, రజాకార్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన జాతీయవాదులు, స్వాతంత్ర్య సమరయోధులు, సామాన్య ప్రజల త్యాగాలకు చరిత్రలో తగిన స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. పరకాల, భైరాన్‌పల్లి వంటి వీరగాథలను పాఠ్యాంశాల్లో చేర్చి, నాటి పరిస్థితులు, ప్రజల ప్రతిఘటన, రజాకార్ల దమనకాండ, హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన పరిణామాలను వాస్తవ ఆధారాలతో నేటి తరానికి బోధించాలని కోరారు. విమోచన చరిత్ర పరిరక్షణలో భాగంగా సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం, విమోచన ఉద్యమంతెలంగాణ సాయుధ పోరాట చరిత్రలను వేర్వేరుగా పాఠ్యాంశాల్లో చేర్చడం, అమరవీరుల త్యాగాలను అధికారికంగా స్మరించడం, చారిత్రక ప్రదేశాలుఘటనలకు గుర్తింపు కల్పించడం వంటి చర్యలను 'సప్త సంకల్పాల'లో భాగంగా అమలు చేయాలని కోరారు. సెప్టెంబర్ 17ను 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహించడం ద్వారా దాని చారిత్రక ప్రాధాన్యతను నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని బీజేపీ నాయకులు ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా చరిత్రను సమగ్రంగా ప్రజల ముందుంచాలని సూచించారు. "తెలంగాణ విమోచన చరిత్ర ఎవరి సొత్తూ కాదు.. అది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ చరిత్ర. చరిత్రను రాజకీయ రంగులు లేకుండా వాస్తవంగా చెప్పాలి. సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినోత్సవమే" అని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తాబేటి వెంకట్‌గౌడ్, జిల్లా కార్యదర్శులు పొనుగోటి వెంకట్‌రావు, రాయబారపు కుమారస్వామి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కూచన క్రాంతికుమార్, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్, ఐటీ ఇన్‌చార్జి ఆడెపు వెంకటేష్, అంబాల రాంగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17న చలో ఫ్యూచర్ సిటీ

## - మల్లేష్ యాదవ్

### కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్

### మహేశ్వరం మండల కేంద్రంలోని అన్ని గ్రామాలు ఫ్యూచర్ సిటీలో కలపాలని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో.. చలో ఫ్యూచర్ సిటీ

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 15:)**

మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలు టీచర్ సిటీలో విలీనం చేయాలని మాజీ శాసనసభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో.. మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలు ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని కోరుతూ సెప్టెంబర్ 17న ప్రతి గ్రామం నుంచి భారీ ర్యాలీగా యువత కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు పెద్ద సంఖ్యలో..విచ్చేయాలని మహేశ్వరం మండల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ తెలిపారు ఇప్పటికే అన్ని గ్రామాల పట్ల కెఎల్ఆర్ సానుకూలంగా స్పందించడం.. ఇప్పటివరకు టిఆర్ఎస్ పార్టీ కీ చెందిన సర్పంచులు తీర్మానాలు ఇచ్చిన ఇయ్యకపోయినా మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలు ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తామని కెఎల్ఆర్ ప్రకటించడంతో.. మాజీ శాసనసభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) కీ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్



RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి

# పోరాట వీరులు కమ్యూనిస్టులే.

**హైదరాబాద్ ఎస్టేట్ 15 సెప్టెంబర్ మంచిర్యాల**





తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాలకులు విస్మరించడం అన్యాయమని, ఆ మహత్తర పోరాట చరిత్రను భావితరాలకు అందించేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మంచిర్యాల జిల్లా మందమర్రి బస్‌స్టాండ్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా వేలాది మంది రైతులు, కూలీలు, మహిళలు, సామాన్య ప్రజలు సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో ఒక మహత్తర అధ్యాయమని అన్నారు. రైతులకు భూమి, వెట్టిచాకిరీ నిర్మూలన, సామాజిక న్యాయం కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన ఈ పోరాటంలో అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. అలాంటి చారిత్రక పోరాటాన్ని నేటి తరానికి తెలియకుండా చేయడం చరిత్రను వక్రీకరించడమేనని అన్నారు. మందీ చరిత్రను మా చరిత్ర అంటూ బీజేపీ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని రామడుగు లక్ష్మణ్ విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బీజేపీ పాత్ర ఏమిటో, ఆ పోరాటంలో పోరాడిన తమ వీరులు ఎవరో తెలంగాణ ప్రజలకు బీజేపీ నాయకులు స్పష్టంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు తిప్పికొట్టాలని, రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జాత ప్రతినిధులు జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ జిల్లా కార్యవర్గ సభ్యులు దాగం మల్లేష్ రేగుంట చెంద్ర శేఖర్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయల లింగయ్య బీమానాదుని సుదర్శన్ మిట్ట పెల్లి శ్రీనివాస్ జిల్లా సమితి సభ్యులు మామిడి గోపి పెరక సంపత్ కాదండి సాంబయ్య ఎగూడ మొండి వనం సత్యం నక్క వెంకట స్వామి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ ఏఐటీయూసీ నాయుకులు మండల్ శ్రీనివాస్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## జన్మదిన సందర్భంగా బ్యాగుల పంపిణీ

**కౌడిపల్లి హైదరాబాద్ ఎస్టేట్ సెప్టెంబర్ 15**




మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని వెల్మ కన్న గ్రామంలో ఎన్నికలలో ఇచ్చిన ఆమి మేరకు వెల్మకన్న గ్రామ సర్పంచ్ కుమ్మరి శివలీల సతీష్ కుమార్తె హర్షిక జన్మదినోత్సవం పురస్కరించుకొని వెల్మకన్న గ్రామంలో సిపిఎస్ ఉన్నంత పాఠశాల లో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు శోభారాణి మరియు స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు సరోజన మాజీ వైస్ ఎంపీపీ బొడ్ల నవీన్ గుప్తా ఉప సర్పంచ్ ప్రభు రవి సాగర్ వార్డు సభ్యులు వహీదా బేగం రజాక్ కుమ్మరి చంద్రకళ వెంకటేశం గణేష్ శత్రు వడ్ల నాగభూషణం అబ్దుల్ అశోక్ సాయి గౌడ్ నలువాల సతీష్ కుమార్ వెంకటేశం కర్ణం కుమ్మరి శ్రీనివాస్ వెంకటయ్య రెడ్డి వెంకటయ్య జంగిటి వెంకటేశం గుడ్సాబ్ నలువాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు





**హైదరాబాద్ ఎస్టేట్ 15 సెప్టెంబర్**

మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని ఎల్లందు క్లబ్ లో భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఇంజనీర్స్ డే) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథి జీఎం, ఇతర అధికారులు మరియు ఇంజనీర్లు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జిఎం మాట్లాడుతూ దేశానికి, ముఖ్యంగా నీటిపారుదల మరియు ఇంజనీరింగ్ రంగానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు అపారమైనవని కొనియాడారు. ఆయన కనబరిచిన క్రమశిక్షణ, నిబద్ధత మరియు పనిరాక్షసత్వం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైనదని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సురక్షితంగా సాధించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం ప్రతిభ కనబరిచిన ఇంజనీర్లను మరియు అధికారులను జీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మందమరి ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం, ఏజిఎం, బాలాజీ భగవతి, మందమరి ఏరియా ఏజెంట్లు, ప్రాజెక్టు ఆఫీసర్లు, ఏజీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు, ఏరియా ఇంజనీర్లు, డివైపిఎంలో పిఒలు సీనియర్ పిఓలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు ఎంతో దోహదపడతాయి

### .. మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేస్తున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ నిర్వాహకులు జవ్వాది సతీష్

**పెద్దకూరపాడు,సెప్టెంబర్15**



వినాయకుని పండుగను పర్యావరణానికి అనుకూలంగా జరుపుకుందామని,ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ నిర్వాహకులు జవ్వాది సతీష్ అన్నారు. పెదకూరపాడులో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ నిర్వాహకులు జవ్వాది సతీష్ సహకారముతో 500 మట్టి వినాయకుని ప్రతిమలను సోమవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జవ్వాది సతీష్ మాట్లాడుతూ రసాయన విగ్రహాలకు బదులుగా మట్టి గణనాధులను పూజించి భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలన్నారు. ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు ప్రతినిధులు కొర్లకుంట బ్రహ్మం,గుడిపూడి రాజశేఖర్, దాసరి కారుణ్య బాబు, సిహెచ్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్..

## పేద కుటుంబాలకు ఆపన్నహస్తం

### - 272 మంది లబ్ధిదారులకు రూ.1.05 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ

**పరకాల, సెప్టెంబర్ 15, హైదరాబాద్ ఎస్టేట్:**



ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మంగళవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల పట్టణం, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన 272 మంది లబ్ధిదారులకు రూ.1,05,08,250 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ పథకాల అమలులో గత బీఆర్ఎస్ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ.500 బోనస్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, వడ్డీలేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు.








